పూత, పిందె లేని చీనీచెట్లు

- చీనీ చెట్లకు ఆశించిన తెగుళ్లు
- దిగుబడులపై తీవ్ర ప్రభావం
- ఆందోళనలో రైతులు


సింహాద్రిపురంలో సాగు చేసిన చీనీ పంట

సింహాద్రిపురం : వాతావరణం అనుకూలించక చీనీ చెట్లకు పూత లేక, పిందె రాకపోవడంతో చీనీ రైతులు ఆందోళన చెందుతున్నారు. జిల్లాలోనే సింహాద్రిపురం మండలంలో 18,150 ఎకరాలలో చీనీ పంటను సాగు చేయగా.. అందులో 13,200 ఎకరాలలో దిగుబడి ఇచ్చే చీనీచెట్లు ఉన్నాయి. 40 ఏళ్ల నుంచి నవంబర్ నెలాఖరు నుంచి జనవరి నెలాఖరు వరకు వచ్చే సీజన్‌లో చీనీ చెట్లు కాపు వచ్చేది. ఈ ఏడాది వాతావరణ ప్రభావంతో డిసెంబర్‌లో వర్షాలు రావడంతో ఈ సీజన్‌లో చీనీ చెట్లు కాపుకు వచ్చినా పూత మగ్గిపోయి పిందె పడకపోవడంతో కాయలు లేవు. కేవలం చీనీచెట్లకు ఇగుర్లు మాత్రమే వస్తున్నాయి. దీంతో చీనీ రైతులు పెట్టిన పెట్టుబడులు కూడా రాక తీవ్రంగా నష్టపోతున్నారు. దాదాపు ఎకరాకు రూ.50 వేలపైబడి వరకు పెట్టుబడులు పెట్టి నష్టపోయామని చీనీ రైతులు వాపోతున్నారు. అంతేకాక చీనీ చెట్లకు బంక తెగులు, పులుసు పురుగు తెగుళ్లతో ఒక పక్క చీనీ చెట్లు చనిపోవడం జరుగుతోందని, మరోపక్క వాతావరణం అనుకూలించక చీనీ రైతులకు ఈ ఏడాది నష్టాలు మిగిల్చాయని వాపోతున్నారు. అరకొరగా చీనీ కాయల ధరలు ఉన్నా నల్ల మచ్చలు ఉండటంతో చీనీ కాయలు ధర ఉన్నా కూడా సగం ధరకే వ్యాపారస్తులు కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతం చీనీ కాయల ధర టన్ను రూ.30 వేల నుంచి రూ.35 వేల దాకా పలుకుతోంది. అయినా వ్యాపారస్తులు చీనీ కాయలకు మంగు ఉండటంతో కొనడానికి ముందుకు రావడంలేదు. చీనీ పంటలో దిగుబడి అంతంత మాత్రంగా ఉండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. సూట్ పేరుతో టన్ను చీనీ కాయలకు 250 కిలోల నుంచి 300 కిలోల చీనీ కాయలు అడుగుతున్నారని చీనీ రైతులు వాపోతున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా నష్టపోయామని చీనీ రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి న్యాయం చేయాలని చీనీ రైతులు కోరుతున్నారు.


చీనీ చెట్లకు ఇగుర్లు వేసిన దృశ్యం

వాతావరణ ఇన్సూరెన్స్ ఇప్పించండి



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నష్టపోయిన చీనీ రైతులకు వాతావరణ ఇన్సూరెన్స్ ప్రకటించి నష్టపోయిన రైతులకు పంపిణీ చేసింది. స్థానిక ప్రజాప్రతినిధులు నష్టపోయిన చీనీ రైతుల దుస్థితిని సీఎం దృష్టికి తీసుకెళ్లి చీనీ రైతులకు వాతావరణ ఇన్సూరెన్స్ ఇచ్చి నష్టపోయిన చీనీ రైతులను ఆదుకోవాలి. అలాగే శనగ రైతులకు కూడా ఇన్సూరెన్స్ వర్తించేటట్లు చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంది.

– కిశోర్‌రెడ్డి,
నెడ్ క్యాప్ మాజీ డైరెక్టర్, సింహాద్రిపురం

తుపాన్ వర్షాలతో తీవ్రంగా నష్టపోయాం



ఇటీవల కురిసిన తుపాన్ వర్షాలకు తీవ్రంగా నష్టపోయాం. ఈ సీజన్ లో చీనీ చెట్లు కాపుకు వచ్చినా పూత మగ్గిపోయి పిందె రాలిపోవడంతో చీనీ కాయలు లేవు. కేవలం చీనీచెట్లకు ఇగుర్లు మాత్రమే వస్తున్నాయి. దీనికితోడు చీనీచెట్లకు తెగుళ్లు సోకడంతో చీనీ కాయలకు నల్లమచ్చలు ఉండటంతో కొనుగోలు చేసేందుకు ఎవరూ ముందుకు రాలేదు.

– గంగాధరరెడ్డి, చీనీ రైతు, సింహాద్రిపురం

ఘనంగా బుడ్డా వెంగల్‌రెడ్డి జయంతి


బుడ్డా వెంగల్‌రెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఆర్‌సీడీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక బీఎస్ఎన్ఎల్ కార్యాలయ సమీపంలో బుధవారం అపర దానకర్ణుడు బుడ్డా వెంగల్‌రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్రారెడ్డి బుడ్డా వెంగల్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్య్రం రాక ముందు రాయలసీమలో కరువు సంభవించినప్పుడు తన ఆస్తినంతా వెచ్చించి ప్రజలను కాపాడిన మహానుభావుడు బుడ్డా వెంగళరెడ్డి అన్నారు. ఆ కాలంలోనే ఒక పూటకు 8 వేల మందికి తక్కువ కాకుండా తిండి పెట్టి ఆకలి తీర్చిన దాన కర్ణుడు అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, మాజీ వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, కౌన్సిలర్ కోడి రమణ, వైఎస్సార్‌సీపీ నాయకులు, ఆర్‌సీడీఎస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు లక్షార్చన పూజ

పులివెందుల టౌన్ : ఈనెల 2వ తేదీన గురువారం శ్రీవెంకటేశ్వరస్వామి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీపద్మావతిసమేత కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో స్వామివారికి లక్షార్చన పూజ కార్యక్రమం ఉంటుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ పూజలో దంపతులు మాత్రమే పాల్గొనాలని, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలను స్వీకరించాలన్నారు. ఈ పూజకు ఎటువంటి రసీదు లేదని, తులసీ పూలు మాత్రమే తెచ్చుకోవాలని భక్తులను కోరారు.

పేద విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ


విద్యార్థినులకు సైకిళ్లను అందిస్తున్న ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్యామలారావు, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ వారి సహకారంతో బుధవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాగా చదువుతున్న పేద విద్యార్థినులు రజిత, నిహారికలకు ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ శ్యామలారావు సైకిళ్లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరం శుభాకాంక్షలతో విద్యలో ప్రతిభ చూపుతున్న పేద విద్యార్థినులను మరింత ప్రోత్సహించేలా సైకిళ్లను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కార్గో సర్వీస్ కార్యాలయం ప్రారంభం


ఆర్టీసీ కార్గో సర్వీస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న బీజేపీ నాయకులు

సింహాద్రిపురం : స్థానిక ఆర్టీసీ బస్టాండులో బుధవారం ఆర్టీసీ కార్గో సర్వీస్ కార్యాలయాన్ని బీజేపీ జిల్లా అధ్యక్షుడు శశిభూషణ్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ కార్గో సర్వీస్‌లతోపాటు టికెట్ బుకింగ్ సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రయాణికుల సౌకర్యార్థం ధర్మవరం బస్సు సర్వీస్‌ను సింహాద్రిపురం నుండి పునఃప్రారంభించాలని ఆయన ఆర్టీసీ అధికారులను కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతో బీసీల అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న బీసీ సంఘం నేతలు

ఎర్రగుంట్ల : అట్టడుగు స్థాయిలో ఉన్న బీసీల అభివృద్ధి జరగాలంటే బీసీలందరు ఐక్యతతోనే సాధ్యమని మండల బీసీ సంఘం నేతలు తెలిపారు. బుధవారం నూతన సంవత్సరం సందర్భంగా కడప రోడ్డులోని కాంప్లెక్స్‌లో మండల బీసీ సంఘం సమితి ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా బీసీ సంఘం నేతలు పలువురు మాట్లాడుతు బీసీలందరు ఆర్థికంగా సామాజికంగా వెనుకబడి ఉన్నారన్నారు. చట్ట సభలలో బీసీల రిజ్వరేషన్ కోసం ప్రత్యేక భద్రతను ఏర్పాటు చేసే విధంగా చట్టాలు తీసుకురావాలన్నారు. ప్రభుత్వాలు మారే కొద్ది బీసీలకు రావాల్సిన వాటిన్నింటిని అగ్రవర్ణాల వారు అడ్డకునే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. బీసీలకు అరాధ్య దైవమైన జ్యోతిరావు పూలే విగ్రహంను యర్రగుంట్లలో ఏర్పాటు చేసేందుకు బీసీలందరు కృషి చేయాలన్నారు.

తల్లిదండ్రులే దైవాలు


వృద్ధుడికి ఆహారం తినిపిస్తున్న విద్యార్థి

కాశినాయన : కనిపెంచిన అమ్మానాన్నలే దైవాలని వివేకానంద సేవాశ్రమం వ్యవస్థాపకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. బుధవారం నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని మైదుకూరు మండలం జి.వి.సత్రం మార్నింగ్ స్టార్ హైస్కూల్‌లో చదువుతున్న పదవ తరగతి విద్యార్థులు వివేకానంద సేవాశ్రమాన్ని సందర్శించారు. విద్యార్థులు ఆశ్రమంలోని అవ్వ తాతలతో ముచ్చటించారు. వారికి అన్నం తినిపించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదవాలన్నారు. సేవాశ్రమాన్ని ప్రత్యక్షంగా చూడటం వలన పిల్లల్లో సేవాభావం, మానవత్వం లాంటి గొప్ప లక్షణాలు అలవరుచుకోవచ్చన్నారు. పిల్లలు భోజనం తినిపిస్తుంటే అవ్వాతాతల కళ్లు చెమ్మగిల్లాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మిరెడ్డి, ఉపాధ్యాయులు సునీత, రమణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు ప్రముఖ వైద్య నిపుణుల రాక

పులివెందుల రూరల్ : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో శుక్రవారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ చర్మవ్యాధుల వైద్య నిపుణరాలు డాక్టర్ సోరియాసిస్, తామర, గజ్జి, ఫంగస్ ఇన్ఫెక్షన్, మొటిమలు, బెదులు, దద్దుర్లు, చుండ్రు, బొల్లి, పెదాలు, నోట్లో పక్కులు, సలిపిరి, తల్లి(అమ్మవారు), సభ్యం, మాగురు, అలర్జీ, ఆనెలు, కాళ్లు పగులుట, పులిపిర్లు, పేను కొరుకుట, జుట్టు రాలుట, గోర్లు పుచ్చుట, ముఖం మీద మచ్చలు, చర్మంపై టీబీ మచ్చలు, కుష్టు, ఇతర చర్మ వ్యాధులకు వైద్య పరీక్షలు అందిస్తారన్నారు.

చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్ధములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 08568 286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

సేవా కార్యక్రమాల్లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు


గండి క్షేత్రంలో సేవా కార్యక్రమంలో ట్రిపుల్‌ఐటీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్‌ఐటీలోని ఎన్ఎస్ఎస్ విద్యార్థులు గండిక్షేత్రంలో వివిధ సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బుధవారం నూతన సంవత్సరం కావడంతో భక్తుల రద్దీ ఉన్నందున ఎన్ఎస్ఎస్ యూనిట్ 1, 13, 14 విద్యార్థులు గండి క్షేత్రంలో క్యూలైన్, స్వామివారి దర్శనం, ఆహార వితరణ, వాహనాల రద్దీని నియంత్రించడం వంటి సేవా కార్యక్రమాలు చేపట్టారు. గండి క్షేత్రం అధికారుల కోరిక మేరకు దాదాపు 100 మంది పైగా ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు. ఆలయ ఈఓ వెంకటసుబ్బయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు కేసరి స్వామి, రాజాలు విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆలయ ఈఓ మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొనడంవలన క్రమ శిక్షణ, భక్తిభావం, సేవా భావం అలవడుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ కుమారస్వామిగుప్తా, పరిపాలన అధికారి డాక్టర్ రవికుమార్, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ దీప్తి, ప్రోగ్రాం ఆఫీసర్లు విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రజా సేవే లక్ష్యం

- బాడీ ఫ్రీజర్, అంబులెన్స్, పరలోక ప్రచార రథాల ఏర్పాటు
- 30 కి.మీ. పరిధిలో ఉచితంగా సేవలు


బుల్లెట్ బాబు, స్థానికుడు, పులివెందుల

పులివెందుల రూరల్ : పులివెందుల నియోజకవర్గంలోని ఏడు మండలాల్లో 30 కి.మీ. పరిధిలో ఉచితంగా బాడీ ఫ్రీజర్, అంబులెన్స్, పరలోక ప్రచార రథాల సేవలను పులివెందులకు చెందిన చెట్టూరు బుల్లెట్ బాబు పేద ప్రజలకు కోసం ఏర్పాటు చేశారు. సుమారు రూ.15 లక్షల వ్యయంతో మూడు వాహనాలను కొనుగోలు చేశారు. ఏడు మండలాల్లోని పేద ప్రజలు ఆసుపత్రులకు వెళ్లాలన్నా వారి కోసం అంబులెన్స్‌లను, ఎవరైనా మృతి చెందితే రెండు రోజులపాటు మృతదేహాన్ని ఉంచేలా బాడీ ఫ్రీజర్, చనిపోయిన మృతదేహాలను అంత్యక్రియలు నిర్వహించేందుకు తీసుకెళ్లే పరలోక ప్రచార రథాన్ని ఉచితంగా పంపించే ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా చెట్టూరు బుల్లెట్ బాబు మాట్లాడుతూ ఏడాది క్రితం పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని ఒక గ్రామంలో మూడేళ్ల క్రితం ఒక వ్యక్తి ఆయన మామ మృతి చెందితే మృతదేహాన్ని బాడీ ఫ్రీజర్‌లో పెట్టేందుకు డబ్బుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్న సమయంలో ఆ వ్యక్తిని చూసి చలించిపోయి పేద ప్రజలెవరూ కూడా బాడీ ఫ్రీజర్, అంబులెన్స్, పరలోక ప్రచార రథం కోసం ఇబ్బందులు పడకూడదన్న ఉద్దేశ్యంతో అల్లా దయవల్ల ఈ రథాలను ఏర్పాటు చేశానన్నారు. పులివెందుల పట్టణంలోని డిగ్రీ కళాశాల రోడ్డులో వీజే ఫంక్షన్ హాలు ఎదురుగా మసీదు స్థలంలో ఈ వాహనాలను ప్రజలకు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వాహనాలు తీసుకెళ్లేవారు డ్రైవర్‌కు కానీ, డీజిల్ వాహనానికి కానీ ఒక్క రూపాయి చెల్లించాల్సిన అవసరంలేదని, 30 కి.మీ. దూరంలో ఉంటే పేద ప్రజలెవరైనా ఈ వాహనాలను సద్వినియోగం చేసుకోవచ్చునన్నారు. ఈ సేవలు అవసరమైన వారు 95027 88074 అనే నెంబర్‌కు సంప్రదించాలన్నారు.


ఉచితంగా ఏర్పాటు చేసిన పరలోక ప్రచార రథం



అందుబాటులో ఉన్న ఉచిత అంబులెన్స్


బాడీ ఫ్రీజర్ వాహనం

దివ్యాంగులకు గృహోపకరణాల వితరణ


దివ్యాంగులకు గృహోపకరణాలను పంపిణీ చేస్తున్న దాత సాయిభరత్‌రెడ్డి, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక ముద్దనూరు రోడ్డులో ఉన్న వికలాంగు కమ్యూనిటీ భవనంలో దివ్యాంగులకు గృహోపకరణాలను పంపిణీ చేశారు. బుధవారం తొండూరు మండలం గంగనపల్లి గ్రామానికి చెందిన ఓబులరెడ్డి రామచంద్రారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని కుమారుడు ఓబుళరెడ్డి సాయిభరత్‌రెడ్డి సంస్మరణ కార్యక్రమం ఏర్పాటు చేసి తన తండ్రి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం 30 మంది దివ్యాంగులకు హాట్ బాక్స్‌లు, స్టీల్ బాటిళ్లను పంపిణీ చేశారు. వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథరెడ్డి, కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కమనీయంగా శ్రీలక్ష్మీవృషభాచలేశ్వర స్వామి కల్యాణోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

వేంపల్లె : పట్టణంలోని శ్రీలక్ష్మీవృషభాచలేశ్వర స్వామి దేవస్థానంలో బుధవారం భక్త బృందం ఆధ్వర్యంలో వేంపల్లె చెందిన మాజీ సర్పంచ్ రాయవరం రామలింగయ్య కుటుంబ సభ్యులు స్వామి వారికి కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. అనంతరం వేంపల్లె గ్రామ సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాచినేని వేణుగోపాల్ సహకారంతో 5వేల మంది భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. అంతకమునుపు ఆలయంలో పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహా మంగళహారతి తదితర విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : రాష్ట్రంలోని మూడున్నర లక్షల మంది సీపీఎస్ ఉద్యోగులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి తెలిపారు. స్థానిక శ్రీరాముపేలట వీధిలోని ఏపీ సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో విశేష కృషి చేసి సీపీఎస్ ఉద్యోగులకు గ్రాట్యుటీ, ఫ్యామిలీ పెన్షన్ సాధించామన్నారు. అదే ఒరవడితో సర్వీసు పెన్షన్‌ను కూడా సాధిస్తామన్నారు. డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ పెన్షన్ అనేది ఉద్యోగి హక్కు అని, దాన్ని ప్రభుత్వాలు అందించడం బాధ్యత అన్నారు. ఏపీ సీపీఎస్‌ఈఏ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎస్ఆర్ వెంకట జనార్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు.

28 రేషన్ షాపులకు నోటిఫికేషన్

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు పట్టణ, మండల పరిధిలోని 28 రేషన్ షాపుల డీలర్ల నియామకానికి అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. ప్రొద్దుటూరు మండలానికి సంబంధించి మున్సిపాలిటీ పరిధిలో 15, మండల పరిధిలో 13 రేషన్ షాపులకు నోటిఫికేషన్ జారీ చేశారు.

రిజర్వేషన్ ప్రకారం ఇంటర్మీడియట్ అర్హత గలిగిన అభ్యర్థులు ఈనెల 8వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంది. 17వ తేదీ అభ్యర్థులకు రాత పరీక్షను నిర్వహించిన అనంతరం ఇంటర్వ్యూ ఏర్పాటు చేసి ఎంపిక చేయడం జరుగుతుంది. వీటిలో 11 రేషన్ షాపులు బైఫరికేషన్ ద్వారా, మిగిలిన 17 రేషన్ షాపుల డీలర్లు రాజీనామా చేయడంతో భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. 18 నుంచి 40 ఏళ్లలోపు వయసు గల వారు ఇందుకు అర్హులుగా నిర్ణయించారు.

ఘనంగా నూతన సంవత్సర వేడుకలు

పులివెందుల టౌన్ : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి పూల బొకేలను, మొక్కలను అందించిన నూతన సంవత్సర శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ సందర్భంగా వైఎస్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, ఖాదర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయాల్లో భక్తుల రద్దీ

బుధవారం నూతన సంవత్సరం కావడంతో ఆలయాలు భక్తులతో నిండుగా దర్శనమిచ్చాయి. భక్తులు తమ ఇష్టదైవాలను ఆరాదించారు. కాయ కర్పూరాలను సమర్పించి వేడుకున్నారు. నూతన సంవత్సరం అన్ని విధాలా కలసి రావాలని.. ఆయురారోగ్యాలతో ఉండేలా ఆశీర్వదించాలని దేవదేవుళ్లను వేడుకున్నారు. అనంతరం భక్తులు తీర్థప్రసాదాలను స్వీకరించారు.

కమలాపురంలో..

కమలాపురం : నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు ఘనంగా సంతోషంగా నిర్వహించుకున్నారు. ముఖ్యంగా మంగళవారం అర్ధరాత్రి 12 గంటల నుంచే యువకులు ఉత్సాహంగా నూతన సంవత్సరానికి ఘనంగా స్వాగతం పలికారు. కేకులు కట్ చేసి పంచి పెట్టారు. స్నేహితులకు, సన్నిహితులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. విద్యార్థులు, పిల్లలు మొదలు కొని వృద్ధుల వరకు 2024కు బై బై చెబుతూ 2025కి స్వాగతం పలుకుతూ సందడి చేసుకున్నారు. బుధవారం మహిళలు, యువతులు ఆలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దదర్గాలో పీఠాధిపతి శ్రీ హజరత్ సజ్జాద్–ఏ–నషీన్ ఫైజుల్ గఫార్ షా ఖాద్రి ఆధ్వర్యంలో స్వర్గీయ పీఠాధిపతి జహీరుద్దీన్ షా ఖాద్రి జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్వామి వారి మజార్లపై పూలచాదర్లు సమర్పించారు. సీఎస్ఐ, ఆర్‌సీఎం, నిస్సీ, టీసీసీ, టీసీసీ టౌన్ చర్చ్, రెహెబోతు, మన్నా, హోసన్నా, షిలోహు, యెరూషలేము చర్చీలలో ఆయా పాస్టర్ల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తదితర పోటీలు నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.


పులివెందులలో వైఎస్ మనోహర్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు


పులివెందులలో భక్తులకు హారతి ఇస్తున్న అర్చకుడు వరదాచార్యులు


జమ్మలమడుగులో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి

వేములలో..

వేముల : మండల వ్యాప్తంగా నూతన సంవత్సర వేడుకలను మండల వాసులు ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం రాత్రి గ్రామాల్లో 12 గంటల వరకు కాలక్షేపం చేస్తూ ఆ తర్వాత నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ సంబరాలు జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లో ప్రజలు కేక్‌లు కట్ చేసుకుని నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నూతన సంవత్సరాన్ని పురష్కరించుకుని ఆయా ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తొండూరులో..

తొండూరు : నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. డిసెంబర్ 31 అర్ధరాత్రి 2024 సంవత్సరానికి ముగింపు పలుకుతూ 2025 నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ యువకులు పెద్ద ఎత్తున కేక్‌లు కట్ చేసి బాణా సంచా పేల్చుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా మండల ప్రజలు నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ సంబరాలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ఉదయం నుండే పెద్ద ఎత్తున స్థానిక ఆలయాలకు మహిళలు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


కమలాపురంలో సీఎస్ఐ చర్చి ఆవరణలో లెమన్ స్పూన్ పోటీల్లో పాల్గొన్న మహిళలు


కమలాపురంలో సీఎస్ఐ చర్చి ఆవరణలో పరుగు పందెంలో పాల్గొన్న పురుషులు

లింగాలలో..

లింగాల : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుధవారం ప్రజలు ఆలయాలలో, మసీదులు, చర్చిలకు వెళ్లి ప్రత్యేక పూజలు, ప్రార్థనలు నిర్వహించారు. పిల్లలు, పెద్దలు నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని కేకులు కట్ చేసి బాణా సంచా పేల్చి నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. ఇళ్ల బయట నూతన సంవత్సర ముగ్గులు వేసి 2025 న్యూ ఇయర్ అంటూ ఆహ్వానం పలికారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నూతన సంవత్సరం సందర్భంగా పార్టీ కార్యాలయాలు నాయకులు, కార్యకర్తలతో కిటకిటలాడాయి. బుధవారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డికి శుభాకాంక్షలు తెలుపటానికి కార్యకర్తలు భారీ సంఖ్యలో వచ్చారు. పెద్దముడియం, మైలవరం, జమ్మలమడుగు మండల, పట్టణంలోని కార్యకర్తలు, నాయకులు పూలమాలతో పాటు బొకేలు తీసుకుని వచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అయితే జిల్లా మున్సిపాలిటీల విభాగ అధ్యక్షుడు హృషికేశవరెడ్డి ఆధ్వర్యంలో వంద కేజిల కేక్‌ను ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి కట్ చేశారు. అలాగే ప్రభుత్వాసుపత్రి, వృద్ధాశ్రమంలోని రోగుల కు, వృద్ధులకు రెవరెండ్ బత్తుల ప్రవీణ్ ఆధ్వర్యంలో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వాసుపత్రి సూపరిండెంటెంట్ రఫిక్‌పాషా, పాస్టర్లు డేవిడ్, జయపాల్, చిట్టిబాబు, తదితరులు పాల్గొన్నారు.